క్లుప్తంగా

రీసర్వే పనులు ప్రారంభం



రీసర్వే పనులపై వివరిస్తున్న తహసీల్దార్ నాంచారయ్య

దెందులూరు : గ్రామాల్లో సర్వేకు వచ్చినప్పుడు సహకరించాలని ప్రభుత్వ లక్ష్యాల సాధనలో తమ వంతు సహాయసహకారాలు సర్వే సిబ్బంది అందివ్వాలని ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ రమణ అన్నారు. గురువారం సానిగూడెం రైతుభరోసా కేంద్రంలో గ్రామ సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) అధ్యక్షతన మండల సర్వేయర్ వై.రమణ ఆధ్వర్యంలో సమగ్ర రీసర్వే గ్రామ సభ జరిగింది. సమగ్ర రీసర్వే రైతులకు వరమని తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. గ్రామ సభలో తహశీల్దార్ క్షుణ్ణంగా రైతులకు మ్యాప్‌ల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం శ్రీరామవరం, సానిగూడెం, ఖండ్రికనర్సింహపురం, ఉప్పుగూడెం, చల్లపల్లి గ్రామాల్లో సమగ్ర రీసర్వే గ్రామ సభలు జరిగాయి.

చింత చెట్టుకు మంటలు



అప్పారావుపాలెం - దెందులూరు మధ్య దగ్ధమవుతున్న చింతచెట్టు

దెందులూరు : అప్పారావుపాలెం- దెందులూరు గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఉన్న భారీ చింతచెట్టుకు గురువారం మంటలు వ్యాపించాయి. స్థానికులు, దెందులూరు విద్యుత్ శాఖ లైన్‌మెన్లు వీరయ్య, శేషు భీమడోలు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఫైర్‌సిబ్బంది వాహనంతో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. భానుడి ప్రతాపానికి చెట్టు మొదలు అంతా ఎండిపోవడం, ఆకతాయిలు ఏదైనా నిప్పురవ్వ పడవేయడంతో మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు చెబుతున్నారు.

మాజీ సర్పంచ్ పెదబాబుకు మాతృవియోగం



దాసరి లక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న నేతలు

పెదపాడు : మండలంలోని వీరమ్మకుంట గ్రామ మాజీ సర్పంచ్ దాసరి పెదబాబు మాతృమూర్తి దాసరి లక్ష్మి బుధవారం రాత్రి మృతి చెందారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. దాసరి పెదబాబుకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల ఏసురాజు, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, నాయకులు రంగయ్య అప్పారావు, ఎంపీటీసీ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా దిశ యాప్



దిశ యాప్‌ను మహిళల ఫోన్లలో ఇన్‌స్టాల్ చేస్తున్న భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్

భీమడోలు: మహిళలు, బాలికలు, వృద్ధుల భద్రతకు భరోసా కల్పించే దిశ యాప్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ ఎం.మేరి ప్రశాంతి ఆదేశాల మేరకు ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం బస్టాండ్లు, కూడలి ప్రాంతాలు, జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లోని మహిళలకు ఆయన దిశ యాప్‌పై అవగాహన కల్పించి వారి సెల్‌ఫోన్లలో దిశా యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. సుమారు 350 మంది మహిళలతో దిశాయాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

పాఠశాలకు వంట పాత్రల అందజేత

భీమడోలు: భీమడోలు నెం.1 ప్రాథమిక పాఠశాలకు డాక్టర్ సత్యం ఫౌండేషన్ నిర్వాహకులు రూ.11వేల విలువైన వంట పాత్రలను గురువారం అందించారు. ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు సత్యం ఫౌండేషన్ నిర్వాహకులు బాలనాగు విజయసారధి మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట సామాగ్రిని అందించారు. 4 రైస్ గిన్నెలు, ఒక అన్నం వార్చే జల్లెడ, రెండు వాటర్ జగ్గులను అందించారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ అహర్నిశలూ కృషి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- జగనన్న ఆణిముత్యాలుకు బహుమతుల అందజేత



టెన్త్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి నగదు బహుమతిని అందిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు స్థానిక నాయకులు

పెదపాడు : విద్యారంగంలో అనేక సంస్కరణలను అమలు చేస్తున్న ప్రభుత్వం విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు వేడుకలను నిర్వహిస్తోందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని సత్యవోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు గురువారం చైర్‌పర్సన్ చేతుల మీదుగా నగదు బహుమతి, మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యకోసం వారి ఉన్నతి కోసం అహర్నిశలు పాటు పడుతోందన్నారు. జగనన్న ఆణిముత్యాలు సాధించిన విద్యార్థులను చూసి మిగతా విద్యార్థులు స్ఫూర్తి పొందాలన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ పదోతరగతి ఫలితాల్లో తమ సొంత గ్రామం సత్యవోలులోని జెడ్పీ హైస్కూల్ మండలంలో 75శాతం ఫలితాలు సాధించి మొదటి స్థానంలో నిలిచినందుకు గర్వంగా ఉందన్నారు. ఘంటా ప్రసాదరావు ఆర్థిక సహకారంతో స్కూల్ ఉన్నత స్థితికి చేరకుందని ప్రధానోపాధ్యాయురాలు కె.రాధ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, ఎంపీడీవో నిర్మలజ్యోతి, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, గ్రామ సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, ఎస్.కొత్తపల్లి సర్పంచ్ చేపేని రంగారావు, స్థానిక నాయకులు సొంగల మహేశ్వరరావు, వైకుంఠపు ధనంజయ్, విశ్రాంత ఉపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపసర్పంచ్ పెంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో మూడో స్థానం సాధించిన బడి శ్రేష్ఠ అనే విద్యార్థికి నగదు బహుమతి మెడల్ ప్రసంశా పత్రం అందించారు, అనంతరం చైర్మన్ దంపతులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు పూలమాలలు, దుశ్శాలువాతోను ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు సత్కారం అభినందనీయం

పెదపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆణిముత్యాలు పేరుతో చదువులో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను ఎంపిక చేసి సత్కరించడం అభినందనీయమని పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాడు జూనియర్ కళాశాలలో గురువారం మెరిట్ విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు, హెచ్‌ఎం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 10 పరీక్షా ఫలితాల్లో రెడ్డి కౌసల్య 555 మార్కులతో ప్రథమ స్థానం, ఎస్ శశాంక్‌బాబాశ్రీ, ఎం.అఖిల్‌పాల్ 537 మార్కులతో రెండోస్థానం, కే.కుసుమ దుర్గ 522 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. వీరికి నగదు బహుమతి, మెడల్ ప్రశంసా పత్రాన్ని అందించారు. భవిష్యత్ తరాలకు మనం అందించే ఆస్తి చదువు మాత్రమేనని చెప్పారు. మంచి విద్యతో విద్యార్థులు ఉన్నత స్థాయి నిపుణులు కాగలరని చెప్పారు. జగనన్న ఆణిముత్యాలు దేశంలోనే అపూర్వ నిర్ణయమన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు సంస్కరణలు తీసుకువచ్చిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో మానవత కో చైర్మన్ కేఎస్ రామకృష్ణారావు, స్థానికులు కొత్తూరి విమలరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు షేక్ గౌస్ మొహియుద్దీన్, పీఎంసీ చైర్మన్ ఆర్‌వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు సోషల్ ఉపాధ్యాయురాలు జి.విజయ నగదు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు.

మరోసారి వైఎస్ జగన్‌ను సీఎం చేయాలి

దెందులూరు : బీసీ నేత, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపునకు ప్రతి ఒక్కరూ మద్దతునిచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసేందుకు జిల్లాలోని బీసీలంతా పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా బీసీ నేత, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, కొవ్వలి ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు కోరారు. పోతునూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 60 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంతో పాటు బీసీలకు రాజ్యాధికారం అమలు చేసి బీసీలపై ఉన్న మక్కువను, ఆసక్తిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారన్నారు. బీసీలంతా కృతజ్ఞతగా వారి హక్కులు పరిరక్షణ అమలు జరిగేందుకు, గౌరవించుకునేందుకు వైఎస్సార్‌సీపీకి వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీ తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఏ సీఎం అయినా బీసీలను పట్టించుకోలేదని, కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుని వదిలేశారన్నారు. ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించి అధికారంలోకి రాగానే బీసీలకు రాజ్యాధికారం డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల ప్రకారం అమలు చేశారన్నారు. ఏలూరు జిల్లాకు బీసీ మహిళ జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. ఆర్.కృష్ణయ్య పిలుపుమేరకు త్వరలో బీసీలంతా ఐక్యంగా వైఎస్సార్‌సీపీకి పూర్తి మద్దతు ఇచ్చేందుకు బీసీ సంఘం తరపున సభలు, సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు.

ఆక్రమణలు తొలగించాలని ఆందోళన



క్రొవ్విడిలో పిల్లకోడు వద్ద ఇరిగేషన్ అధికారికి సమస్యలు చెబుతున్న రైతులు

నిడమర్రు: క్రొవ్విడి గ్రామంలో పంటమబోదె వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించి కాలువ ప్రక్షాళన చేయాలని స్థానిక రైతులు రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులకు పిర్యాదు చేసారు. దీంతో గురువారం ఇరిగేషన్ ఏఈ పణిశంకర్ గ్రామంలో వచ్చి రైతుల సమస్యలపై చర్చించారు.. ఈ సందర్భంగా అధికారులతో స్థానిక రైతులు నౌడు రామారావు, కర్రి శివయ్య మాట్లాడుతూ పిల్లకోడు కాలువ నెంబర్ 40 వ తూర దిగువన సుమారు 400 ఎకరాల సాగు జరుగుతోందన్నారు. ఈ పంటబోదె వెంబడి ఉన్న రెవిన్యూ భూముల్లో దూళ్లపాకలు, పశువుల కొట్టాలు స్థానికులు నిర్మించుకు పోవడంతో కాలువ పూర్తిగా పూడిపోతుందన్నారు. దీంతో సాగు నీరు పారుదలకు ఆటంకం ఏర్పడి బోదె శివారు వరకూ ఉన్న పొలాలకు సాగు నీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదన్నారు. బోదె వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగిస్తే రైతులే స్వయంగా బోదె పూడిక పనులు చేసుకుంటామని ఇరిగేషన్ ఏఈ ఫణిశంకర్‌కు తెలిపారు. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి బోదె పూడిక తీతకు పూర్తి స్థాయి సహకారం అందిస్తామని ఏఈ ఫణిశంకర్ రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిరపారపు శ్రీను, ధనుకొండ మోహన్‌రావు, పండు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మానవత మండల అధ్యక్షుడిగా నౌడు



నిడమర్రులో ప్రమాణస్వీకారం చేస్తున్న మానవత నూతన కార్యవర్గ సభ్యులు

నిడమర్రు: మానవత స్వచ్ఛంద సంస్థ నిడమర్రు మండలం శాఖ అధ్యక్షుడిగా సిద్దాపురం గ్రామానికి చెందిన మాజీ వైస్‌ఎంపీపీ నౌడు వెంకట అచ్యుత రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ప్రధాన కార్యదర్శిగా బుద్దగిరి పవన్ (పెదనింద్రకొలను), కోశాధికారిగా సంకు శ్రీను (బువ్వనపల్లి), ఉపాధ్యక్షులుగా సంకు కొండలరావు, నిమ్మల దొరబాబులు. కార్యవర్గ సభ్యులుగా నిప్పులేటి కుమార స్వామి, సరిపల్లె విజయకుమారి, అంబళ్ల విజయభాస్కర్, ముత్యాల సత్యనారాయణ తదితరులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అచ్యుతరారావు మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణంకు మానవత కృషి చేస్తుందని, ఈ ఏడాది మరింత సభ్యత్వ నమోదుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానవత అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు, రాష్ట్ర విస్తరణ విభాగం సభ్యులు జానకి రామరాజు, మండల చైర్మన్ సంకు సత్యకుమార్, మాజీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను, సభ్యులు వెల్లంకి నరేష్, పుప్పాల మేరీ, కిలారి రవి, నిమ్మల బాబురావు, ఎంసీ హెచ్‌ఎం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



గుండుగొలనులో విద్యాకానుక కిట్లను అందిస్తున్న దృశ్యం

భీమడోలు: పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగుల భరోసా కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు తల్లిదండ్రులు జీవితాంతం రుణపడి ఉంటారని గుండుగొలను సర్పంచ్ కూర్మా లక్ష్మీరాజ్‌కుమార్ అన్నారు. గుండుగొలను నెం.1 ఆదర్శ పాఠశాలలోని 131 మంది బాలబాలికలకు గురువారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. హెచ్‌ఎం పాశం పాండురంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కూర్మా లక్ష్మీరాజ్‌కుమార్, పీసీ కమిటీ చైర్మన్ నండెడ్ల విజయశాంతిలు చిన్నారులకు జాతీయ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న చిన్నారులకు పాఠశాలలు తెరిచినాడే పుస్తకాలను అందించడం చాలా సంతోషదాయమన్నారు. టీచర్లు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాశ్వత భూ హక్కుతో రైతులకు మేలు



జగనన్న శాశ్వత భూహక్కు సదస్సులో మ్యాప్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్: ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు పథకం రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. గురువారం ఏలూరు మండలం కొక్కిరాయిలంకలో జగనన్న భూహక్కు పథకంపై అధికారులు రైతులు, ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సోమశేఖర్ మాట్లాడుతూ సాంకేతికత ఉపయోగించి ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టిందన్నారు. దీంతో భూమి హక్కుదారులకు భద్రత పెరిగిందని తెలిపారు. డ్రోన్ సర్వే, ఆర్తో రెక్టిఫైయిడ్ ఇమేజ్ వల్ల భూముల ఖచ్చితత్వం ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో ప్రతి రైతూ తమ భూమి వివరాలు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. అనంతరం అధికారులు, సిబ్బంది భూముల మ్యాప్‌ను ప్రదర్శించారు. సర్పంచ్ తోకల అమల అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రమణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మండల సర్వేయర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ సర్జన్ భాస్కరానంద్‌కు సత్కారం

ద్వారకాతిరుమల : స్థానిక విర్డ్ ఆసుపత్రిలో అంతర్జాతీయ ప్రఖ్యాత హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కరానంద్‌ను ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు, వైద్యులు గురువారం ఘనంగా సత్కరించారు. వైద్య రంగంలో భాస్కరానంద్ అందిస్తున్న సేవలను, ఆయన ఖ్యాతిని చాటుతూ ఇటీవల సింగపూర్‌లో ఏషియన్ పసిఫిక్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ వారు 'ఫర్ సర్జరీ ఆఫ్ ద హ్యాండ్' అనే బుక్‌ను రూపొందించారు. దాన్ని సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ క్రమంలో విర్డ్ ఆసుపత్రికి విచ్చేసిన డాక్టర్ భాస్కరానంద్‌ను ట్రస్టు సభ్యులు ఐవీఆర్ సుధాకర్, డాక్టర్ భవ్యచంద్, శ్రీవారి దేవస్థానంఏఈఓ పి.నటరాజరావు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి ఘనంగా సత్కరించారు. పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని అందజేశారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల స్కూల్



జానంపేటలోని ప్రకాశ్‌నగర్‌లో ప్రత్యేక అవసరాల చిన్నారుల కోసం నిర్మించిన డిసాలెస్ స్పెషల్ స్కూల్





కంప్యూటర్, వినికిడి యంత్రం ద్వారా శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు

పెదవేగి : ప్రత్యేక అవసరాలు గల బాలబాలికల విద్యాభివృద్ధి కోసం పెదవేగి మండలంలోని జానంపేట పంచాయతీ పరిధి ప్రకాశ్‌నగర్‌లో 2006వ సంవత్సరంలో డిసాలెస్ స్పెషల్ స్కూల్ (చెవుడు, మూగ విద్యార్థులకు మాత్రమే)ను స్థాపించారు. ఈ పాఠశాల 'డాటర్స్ ఆఫ్ సెయింట్ ఫ్రాన్సిస్ డిసాలెస్' అనే మిషనరీ ఎన్‌జీఓ సంస్థ ద్వారా నడుపుతున్నారు. ఈ పాఠశాల్లో 1 తరగతి నుంచి 10వ తరగతి వరకూ బోధన చేస్తున్నారు. ఈ పాఠశాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందింది. ప్రత్యేక శిక్షణ పొందిన బోధన సిబ్బందితో తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ప్రస్తుతం 50 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మరో 50 మంది వరకూ అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇక్కడ జిల్లా నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చెప్పే స్టేట్ సిలబస్‌నే ఇక్కడ కూడా బోధిస్తారు. 15 సంవత్సరాలలోపు మూగ, చెవుడు విద్యార్థులు ఇక్కడ దరఖాస్తు చేసుకోవటానికి అర్హులు. విద్యతోపాటు, హాస్టల్ సదుపాయం సైతం ఉచితంగా కల్పించారు. చదువుతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం శిక్షణ ఇస్తున్నారు. వివరాలకు ఫోన్ 62814 28466, 89854 68473, 73560 06778 నంబర్లను సంప్రదించవచ్చు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



డాటర్స్ ఆఫ్ సెయింట్ ఫ్రాన్సిస్ డిసాలెస్ స్కూల్‌ను ఏర్పాటుచేసి పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని చెవిటి, మూగ చిన్నారులకు బాసటగా నిలిచేందుకు కృషి చేస్తున్నాం. అతి తక్కువ ఫీజులతో అందించే ఈ విద్య, వసతి సౌకర్యాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలి.

– సిస్టర్ సుష మ్యాథ్యూ, డిసాలెస్ స్కూల్ ప్రిన్సిపాల్

మరణానంతర నేత్రదానానికి ముందుకు

భీమడోలు:మరణానంతరం నేత్రదానం చేసి దాతలు భవిష్యత్తు తరాలకు కంటి చూపులేని ఎందరో అభాగ్యులకు వెలుగులు నింపి ఆదర్శంగా నిలుస్తారని అమ్మా ఐ, ఆర్గాన్ అండ్ బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ టి.సుమన్‌బాబు అన్నారు. గుండుగొలను గ్రామానికి చెందిన తల్లీకుమార్తెలు కొప్పిశెట్టి ఆదిలక్ష్మీ, కానూరి పార్వతిలు సంస్థకు గురువారం స్వచ్ఛందంగా మరణానంతరం నేత్రదానం చేసేలా దరఖాస్తు పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా టి.సుమన్‌బాబు మాట్లాడుతూ దేశంలో లక్షలాది మంది కంటి చూపు లేక నేత్రదానం చేసే వారి కోసం ఎందరో అభాగ్యులు ఎదురు చూస్తున్నారన్నారు. మరణానంతరం నేత్రదానం, అవయవదానం, శరీర దానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

అంగన్‌వాడీల్లో జన్‌భగీదారీ

ఉంగుటూరు: మండలంలోని కైకరం, ఉంగుటూరు గ్రామాల్లోని అంగన్‌వాడీల్లో జన్‌భగీదారీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఆయా గ్రామాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన కార్యక్రమంలో వివిధ మాతాశిశు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ కేవీఎఎస్ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మండల అభివృద్ధికి సహకరిస్తా'

ఏలూరు రూరల్: ఏలూరు మండల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గురువారం ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మత్స శ్రీనివాసరాజు, కార్యాలయ ఏఓ వై.సుజాత, సిబ్బంది జెడ్పీ అతిథి గృహంలో చైర్మన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ దెందులూరు నుంచి పద్మశ్రీ జెడ్పీ చైర్మన్‌గా ఎన్నిక కావడం హర్షణీయమన్నారు. మండల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ తప్పక సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పద్మశ్రీ ప్రసాద్‌లకు శాలువ కప్పి అభినందనలు తెలిపారు.

ఘనంగా శ్రీశ్రీ వర్ధంతి



శ్రీశ్రీ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: అభ్యుదయ దృక్పథంతో తెలుగు కవిత్వానికి దారి చూపిన మహాకవి శ్రీశ్రీ అని శ్రీశ్రీ ఆలోచనలకు అనుగుణంగా సమ సమాజ నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందని నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం నారాయణపురం కళాశాలలో శ్రీశ్రీ 40వ వర్ధంతి నిర్వహించారు. అధ్యాపకులు వెంకటేశ్వర్లు రెడ్డి, కొండ రవి పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమా రైతులకు వరం



వైఎస్సార్ బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న నెహ్రూ

ఏలూరు రూరల్: వైఎస్సార్ పశుబీమా పథకం పాడి రైతులకు వరం వంటిదని జిల్లా పశుసంవర్ధకశాఖ సయుంక్త సంచాలకులు డాక్టర్ జి.నెహ్రూ అన్నారు. గురువారం ఏలూరు మండలం చాటపర్రు పశు వైద్యశాలలో రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకందార్ల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పశుబీమా పథకం ఏర్పాటుచేసిందని చెప్పారు. పశువు చనిపోయినప్పుడు రైతును ఈ పథకం ఆర్థికంగా ఆదుకుంటుందని అన్నారు. ఒక్కో కుటుంబం కనిష్ఠంగా 5 గేదెలు, 50 గొర్రెలు లేదా మేకలను బీమా చేసుకోవచ్చన్నారు. రేషన్‌కార్డు ఉన్నవారు 20 శాతం, కార్డు లేనివారు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే బీమా అర్హత పొందుతారని వివరించారు. ఒక్కసారి ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల పాటు బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ రామచంద్రరావు, సహాయ సంచాలకులు డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, స్థానిక వైద్యురాలు ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని లే అవుట్లపై అప్రమత్తత అవసరం

ఉంగుటూరు: గ్రామాల్లో అనుమతులు లేకుండా లే అవుట్లు వేస్తున్నారని ఈ విషయంలో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాల ఈఓపీఆర్ షంషుద్దీన్ అన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఈ విషయం స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి అందుకోలేని వారిని గుర్తించడం కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయ మూర్తి పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి

ఉంగుటూరు: వృద్ధులను ఆదరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వృద్ధులు వినతి పత్రాన్ని అందజేశారు. ఉంగుటూరు వృద్ధుల సంక్షేమ సంఘం తరపున కొండ్రెడ్డి సర్వేశ్వరరావు ఆధర్యంలో కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణకు వినతిపత్రాన్ని అందించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అభివృద్ధి ప్రచార కరపత్రం ఆవిష్కరణ

ఉంగుటూరు: దేశం గౌరవాన్ని కాపాడిన గొప్ప వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, గోదావరి జోనల్ పార్టీ ఇన్‌చార్జి గారపాటి తపన చౌదిరి అన్నారు. గురువారం ఉంగుటూరు సామాజిక భవనంలో బీజేపీ ప్రభుత్వం 9 ఏళ్లలో చేసిన అభివృద్ధి ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో నగరపాటి సత్యనారాయణ, అడపా శోభారాణి, మత్తి శ్రీనివాసశాస్త్రి, పంజరపు దుర్గారావు, కాకిలేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.